26

# ఎవరు యాచకుడు?

ఒక రాజుగారుండేవారు.

'అంగట్లో అన్నీ ఉండి అల్లుని నోట్లో శని!' అన్నట్లు పాపం- ఆయనకి అన్నీ ఉన్నా ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. దానికితోడు- సంతానం కూడా లేదు. ఈ రెండింటి మూలంగా ఆయన ఎప్పుడూ విచారంగా వుండేవాడు.

ఒకరోజు రాజుగారు తన పరివారంతో వేటకి వెళ్లాడు.

ఆ ఉత్సాహంలో ఆయన తన వాళ్ళని వదిలి చాలా దూరం వెళ్లిపోయాడు. సాయంత్రం అవుతుంటే చీకటి పడసాగింది. అప్పుడు అర్థమయింది ఆయనకి...తాను దారితప్పానని!

ఆ రాత్రికి ఎక్కడ వుండాలో, ఏమి చేయాలో తోచలేదు.

దగ్గర్లోవున్న చెట్టు ఎక్కి చూసేసరికి, కొంచెం దూరంలో ఒక వాగు- దాని ప్రక్కనే పర్ణశాల కనిపించాయి. వెంటనే తన గుర్రాన్ని అటు పోనిచ్చాడు రాజు.

ఆ పర్ణశాలలో ఒక యోగి ధ్యానం చేసుకుంటున్నాడు.

రాజు వెళ్లి ఆయన ముందు సాష్టాంగపడి నమస్కారం చేసి, భక్తితో ఎదురుగా కూర్చున్నాడు.

కొంచెం సేపటికి – ఆ యోగి కళ్ళు తెరిచి, "నరేంద్ర మహారాజా... అడవిలో దారితప్పి అలసి పోయావు. పాలూ, ఫలాలు ఇస్తాను. అరగించి ఈ రాత్రికి ఇక్కడనే విశ్రమించు" అన్నాడు.

తన పేరుతో సహా సంగతంతా చెప్పగలిగిన ఆ మహర్షి దివ్యదృష్టికి ఆశ్చర్యపోయాడు

రాజు



మర్నాడు మహర్షి వద్ద సెలవు తీసుకుంటూ "స్వామీ...మీరు మా రాజ్యంలో అడుగుపెట్టి పావనం చేయాలి.., నేను భక్తి తో ఇచ్చే కానుకలను స్వీకరించాలి" అంటూ ప్రాధేయపడ్డాడు నరేంద్ర మహారాజు.

"రాజా! నేను సర్వసంగ పరిత్యాగిని. నాకేం కావాలి చెప్పు ?" అన్నాడు మహర్షి.

"అలాకాదు. తమకు ఇష్టమొచ్చిన కానుకను కోరుకొనండి. దానిని తమరు ఏ విధంగా సద్వినియోగం చేసినా సంతోషమే!" అన్నాడు రాజు బలవంతపెడుతూ.

రాజుగారి మాట కాదనలేక యోగి నరేంద్రుని వెంట ఆయన రాజ్యానికి వెళ్లాడు.

ఆయనకి రాజు సకుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో శుశ్రూష చేయసాగాడు. చివరికి యోగి తిరిగి తన ఆశ్రమానికి వెళ్లే సమయం వచ్చింది.

ఆ రోజు ముని కోరిన కానుకను ఇయ్యాలన్న కృతనిశ్చయంలో ఉన్నాడు రాజు. మహర్షికి శుశ్రూషలు చేసిన తర్వాత రాజు - "మహాత్మా...తమరు ఎంతో మహత్తు కలవారు! నేను అనారోగ్యంతోను, సంతానలేమితోనూ బాధపడుతున్నాను. నాకు ఆరోగ్యాన్నీ, సంతానాన్నీ అనుగ్రహించండి!" అని విన్నవించుకున్నాడు.

ఆ మాట వినగానే యోగి దిగ్గున లేచి వెళ్లిపోసాగాడు.

రాజు ఆయన వెంట పడి "స్వామీ... నేను తెలియక చేసిన పొరపాటు ఏమైనావుంటే తెలియజెప్పి తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇయ్యండి స్వామీ!" అంటూ ప్రాధేయ పడసాగాడు.

యోగి- "రాజా... నీ కోరిక మేరకు నీ దగ్గర నుంచి కానుకను కోరడానికి వచ్చాను. కానీ ..,నీవే ఒక యాచకుడవు అనుకోలేదు. నన్ను వరాలు యాచించే నీ దగ్గర నేనేమి యాచించను?" అంటూ సాగిపోసాగాడు.

"స్వామీ... నాపై దయ చూపండి!" అంటూ దీనంగా ప్రాధేయ పడసాగాడు రాజు.

"రాజా! ఆరోగ్యం, సంతానం... వంటివి నీవు చేసే మంచి పనుల ననుసరించి ఉంటాయి. ఇకనుంచి ఇతరులకు మేలు చేయి, నీ కర్మ పరిపక్వమై నీ సంకల్పసిద్ధి కలుగుతుంది" అని తన ఆశ్రమానికి వెళ్లిపోయాడు మహర్షి.

ఆనాటి నుంచి రాజుగారు తన ప్రజల్ని కన్న బిడ్డలవలె చూసుకుంటూ వారికి ఎన్నో విధాల మేలు చేయసాగాడు. అచిరకాలంలోనే ఆయన ఆరోగ్యం బాగుపడి సంతానవంతుడు కూడా అయ్యాడు.

★★★